క్లుప్తంగా

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని వెల్లటూరు, వెల్లటూరు దళితవాడ, శవాస్కన్‌పల్లె, రెడ్డిపల్లె, గోపులాపురం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు వీన్‌పల్లెకు..

వీరపునాయునిపల్లె : వాటర్‌షెడ్ ద్వారా రైతులకు సోమవారం ఉదయం 10 గంటలకు రాయితీతో పైపులు అందజేయనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గంగిరెడ్డిపల్లె గ్రామం వద్ద జగనన్న కాలనీకి భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కారకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అమృత అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, విద్యుత్, ఉపాధి హామీ, తాగునీరు, సాగునీరు, ఉద్యాన శాఖ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని.. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

నేడు మండల పూజ

లింగాల : స్థానిక కోదండరామాలయంలో సోమవారం మండల పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పునః నిర్మించిన నూతన రామాలయంలో గతనెల 3వ తేదీన సీతారామలక్ష్మణసమేత ఆంజనేయ స్వామి నూతన శిలా విగ్రహాలను ప్రతిష్టించారు. సోమవారం నాటికి 41 రోజులు పూర్తి కావడంతో మండల పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. హోమ గుండ ప్రజ్వలన, కలశాభిషేకం, దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించనున్నారు.

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కంపచెట్లలో మంగతాయి గ్యాంబ్లింగ్, జూద మాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5110 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సంజీవరెడ్డి ఆదివారం తెలిపారు.

ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందాం

జమ్మలమడుగు : గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కంబాలదిన్నె మారెమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని గ్రామ సర్పంచ్ బొగ్గుల చంద్ర, పీఠాధిపతి టి.వుల్లమ్మలు ఆదివారం ఆలయంలో గ్రామ ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. గ్రామ దేవత ఆలయం అభివృద్ధి చేసుకోవడంలో అందరు కలిసికట్టుగా రావాలన్నారు. ఆలయానికి ఎటువంటి మాన్యాలు లేవు కాబట్టి ప్రజలు భక్తులు ఆలయ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.

పైడికాలువలో నాకా బందీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో ఆదివారం ఉదయం పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఎస్‌ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లను నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కడప, పొద్దుటూరు, రాయచోటి, రైల్వేకోడూరులతో పాటు పలు ప్రాంతాల్లో పాఠశాలలు ప్రారంభంకాకమునుపే 60 శాతం అడ్మిషన్లు పూర్తి చేసుకున్నారన్నారు. జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల వివరాలను విద్యాశాఖ బహిర్గతం చేయాలన్నారు.

యువత ముందుండాలి

కడప ఎడ్యుకేషన్: రక్తదానంలో యువత ముందుండాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన ప్రచార పోస్టర్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. రక్తదానం చేస్తే ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

బోరు మోటార్లకు స్వస్తి.. సూక్ష్మ సేద్యంపై ఆసక్తి

బిందు, తుంపర సేద్యాల వైపు రైతన్నలు

పులివెందుల రూరల్ : ఆధునిక వ్యవసాయ రంగంలో బిందు, తుంపర వంటి సేద్యాలు రైతన్నలను ఎంతో ఆదుకుంటున్నాయి. ఇది వరకు సాగించిన బోరు మోటార్లకు స్వస్తి పలికి సూక్ష్మ సేద్యంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నీటి ఆదా కావడంతో సూక్ష్మ సేద్యంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల భూములకు ఈ సూక్ష్మ సేద్యం ఎంతో ఉపయోగపడుతుందని పలువురు రైతులు అంటున్నారు.

అలాగే ఏటవాలు భూములతోపాటు ఎర్ర రేగడి, నల్ల రేగడి, గరుగు నేలలకు ఈ సేద్యాలు ఎంతో ఉపకరిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇందుకు ఉద్యాన శాఖ రైతులలో ఉత్సాహం నింపడానికి వందశాతం రాయితీతో సంబంధిత పరికరాలను అందిస్తుంది. ఈ సేద్యాలను ఉపయోగించి ఆశించిన లాభాలు సాధించడం ద్వారా ఇటీవల వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇ.కొత్తపల్లె గ్రామ సర్పంచ్ నాగప్రసాద్‌కు అవార్డును అందజేశారు. గతంలో వ్యవసాయ రంగంలో బావులను ఉపయోగించి వివిధ రకాల పంటలను సాగు చేసేవారు. కాలక్రమేనా తరుచూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం, కరువు కాటకాలు సంభవించడం వంటి కారణాలవల్ల భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయం సాగించడానికి గొట్టపు బోర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గొట్టపు బోర్లను ఏర్పాటు చేసుకున్న అనంతరం వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాలు ఏర్పడటంతో రైతులకు సాగునీటి సమస్య తలెత్తింది. పులివెందుల ప్రాంతంలో వేలాది అడుగుల లోతు బోర్లు వేసినా నీరు లభించడం కష్టంగా ఉండేది. అరటి, మామిడి, చీనీ, సన్న నిమ్మ, బొప్పాయి వంటి పంటలను రక్షించుకోవడానికి 1000 నుంచి 2వేల అడుగుల లోతు వరకు బోర్లు వేసినా ఫలితం ఉండేదికాదు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో రైతులు సంప్‌ల ద్రావా నీటిని అందించేందుకు కొత్త ప్రయోగాలను చేపట్టారు. వీటివల్ల కూడా వ్యయ ప్రయాసాలు ఎదుర్కొనక తప్పలేదు. వీటివల్ల లాభం లేదనుకున్న రైతులు బిందు, తుంపర సేద్యాలపై దృష్టి సారించారు. ప్రభుత్వాలు కూడా తుంపెర, బిందు సేద్యాలపై రైతులకు ఉత్సాహం కలిగించేందుకు వివిధ రాయితీలు కూడా ప్రకటించింది. ఈ క్రమంలోనే ఇ.కొత్తపల్లె రైతులు సూక్ష్మ సేద్యాన్ని పాటించి అవార్డు స్థాయి వరకు వెళ్లారు.



అరటి పంటలో ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పరికరాలు



రైతు ఏర్పాటు చేసుకున్న బిందు సేద్య పరికరం వద్ద ఉద్యాన శాఖ అధికారులు

బిందు, తుంపర సేద్య పరికరాలపై ఆసక్తి ..



పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె పరిధిలో 562 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. 461 హెక్టార్లకు డ్రిప్, అలాగే 101 హెక్టార్ల భూమికి తుంపర కలిపి 630 మంది రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందించాందీంతో అరటి, వేరుశనగ తదితర పంటలను గ్రామ రైతులు సాగు చేసుకున్నారు. గతంలో వ్యవసాయ రంగంలో బావులను ఉపయోగించి వివిధ రకాల పంటలను సాగు చేసేవారు. కాలక్రమేనా బోరుబావులకు స్వస్తిపలికి బిందు, తుంపర సేద్య పరికరాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– రాఘవేంద్రారెడ్డి(హెచ్‌ఓ), పులివెందుల

కృతజ్ఞతలు

కమలాపురం : కమలాపురం–మైదుకూరు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించిన ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలకు కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కమలాపురంలో నూతన ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనుల భూమి పూజకు వచ్చిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేలను కమలాపురం–మైదుకూరు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఇతర నాయకులు గ్రామ ప్రజలతో కలసి ఎస్‌సీ పుల్లారెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రజలు ఆర్టీసి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే మరో సర్వీసును కూడా ఏర్పాటు చేయాలని ఆయన ఆర్టీసీ అధికారులను కోరారు.

ప్రతిభ కనబరిస్తే మంచి అవకాశాలు

జమ్మలమడుగు : విద్యార్థులు ప్రతిభ చూపితే ప్రైవేట్ కంపెనీలలో మంచి ఉద్యోగావకాశాలు వస్తాయని ఎస్వీ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం కాలేజీ క్యాంపస్ సెలెక్షన్‌ల కోసం మొత్తం 11 కంపెనీలో ఉద్యోగ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 55 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వారికి ప్రతి ఏడాది రెండు లక్షల నుంచి 3.5 లక్షల రూపాయలు జీతం ప్రారంభంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులతోపాటు మంచి ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల మెంటర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన సింహాద్రిపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులు రసాయనిక ఎరువులు వాడటంవల్ల భూమి గుల్లబడి దిగుబడులు రాక పెట్టుబడులు అధికంగా పెట్టి నష్టపోతుంటారని.. అందుకు ప్రభుత్వం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే భూమిలో పోషకాలు పెరిగి వానపాములు సమృద్ధిగా ఉంటాయన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం, దిగుబడి బాగా ఉంటుందన్నారు. అనంతరం 50 సెంట్లలో 10 రకాల కూరగాయలను పండించడానికి అవసరమైన ఘన జీవామృతాన్ని తయారు చేయించారు. కార్యక్రమంలో రైతు రాజశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఆదివారం పాయసంపల్లెలో ఆయన నాకా బందీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇరు పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని ఏ వైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే గ్రంథం భగవద్గీత

బద్వేలు అర్బన్ : భగవద్గీత పఠనం ద్వారా ప్రతిఒక్కరిలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చని త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక – ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అబ్బుసాహెబ్‌పేట, బోయినపల్లె, ఉప్పత్తివారిపల్లె, గొడుగునూరు, పుట్టాయపల్లె గ్రామాల్లో పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను పఠించడంతో పాటు అందులోని బోధనలను పాటించడం ద్వారా సుఖ శాంతులతో పాటు సంస్కారం పొందవచ్చన్నారు. ముఖ్యంగా నేటితరం విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి భగవద్గీత పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

కార్యక్రమంలో త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక సభ్యులు వెంకటేశ్వర్లు, సుధాకర్, వెంకటక్రిష్ణ, పెంచలరత్నం, రమ్యశ్రీ, గాయత్రి, హరిప్రియ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రకు ప్రభుత్వ సాయం మరువలేం

కడప కార్పొరేషన్: ఈ ఏడాది హజ్‌యాత్రను సఫలీకృతం చేయడంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మున్నా అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను మతపెద్దలు, పీఠాధిపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి విమానయాన చార్జీలు ఒక్కొక్క హజ్ యాత్రికునిపై రూ.80 వేలు అదనంగా పడుతుండటంపై స్పందించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత సాంకేతిక కారణాల వల్ల వారు ఏం చేయలేమని చేతులెత్తేయడంతో అదనంగా అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందన్నారు. సుమారు రూ.14.50కోట్లు రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు సాయం చేసిందన్నారు. దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాల్లో ఇలాగే ఎక్కువ చార్జీలు ఉన్నప్పటికీ ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలా సాయం చేయలేదని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీల పట్ల వైఎస్ జగన్ చూపుతున్న ఆదరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వలీవుల్లా హుస్సేనీ, కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు.

కాల భైరవాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో ఆదివారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయం వెలుపల భక్తులు ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రత్యేక పూజలలో భాగంగా కుష్మాండ దీపాలతో స్వామికి భక్తులు హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు, కార్తీక్‌రెడ్డి తదితరులు పూజలను పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో బోగాదమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో బోగాదమ్మతల్లి

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలో కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సండే సందడి



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులు జానపద, శాస్త్రీయ, సినీ పాటలకు వేసిన స్టెప్పులు అందరిని అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తవారి పట్ల జాగ్రత్తగా ఉండాలి

కడప కల్చరల్: ఆలయాలలో పూజలు చేసేందుకు గ్రామాలలో పౌరోహిత్యం నిర్వహించేందుకు వచ్చే కొత్తవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మోచంపేటలోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొందరు అర్చకులు నేరాలకు పాల్పడినట్లు ప్రసార మాధ్యమాల్లో వస్తోందని, అలాంటి వారి పట్ల అర్చక వృత్తికి కళంకం తెస్తోందన్నారు. ఆలయాలలో అర్చకత్వానికి కొత్త వ్యక్తులను తీసుకునేటపుడు వారి చరిత్రను సంపూర్ణంగా తెలుసుకున్న తర్వాతే అవకాశం ఇవ్వాలన్నారు.

పౌరోహిత్యం చేయించుకోదలిచిన వారు కూడా పురోహితుని ఎంపికలో జాగ్రత్తలు వహించాలని, అవసరమైతే స్థానిక అర్చక పురోహిత సంఘాల ప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్లాలన్నారు. కొత్తవారిని పూజలకు అనుమతించే ముందు దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.

తెలుగులో ప్రతిభకు ప్రోత్సాహం

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఆ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బి.శివారెడ్డి సొంత నిధులతో ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున హెచ్‌ఎం ప్రేమకుమారి చేతుల మీదుగా ఆదివారం నగదు బహుమతి అందజేశాడు. ఈ ఏడాది జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఎర్రగుడిపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్.నిఖితకు తెలుగు సబ్జెక్టులో అత్యధికంగా 97 మార్కులు, అలాగే ఎస్.లక్ష్మీ మమతకు 96 మార్కులు వచ్చాయి.



నగదు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ డీఈ గంజికుంట వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం తొగటవీరక్షత్రియ విద్యార్థులకు 11వ వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను వారికి ఇష్టం వచ్చిన దానిలో ప్రోత్సహిస్తే రాణిస్తారన్నారు. తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభ గల తొగట పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 11 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలను శ్రీచౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అందచేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థులకు, స్థానికంగా ఇంటర్ చదివి మంచి మార్కులు సాధించిన అన్ని గ్రూపుల విద్యార్థులకు, డిగ్రీ, బీటెక్, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేశారు. అలాగే ఎంబీబీఎస్ చదువుతున్న జి.శ్రీలీల అనే విద్యార్థినికి రూ.50వేలను కళాశాల, హాస్టల్ ఫీజుకోసం అందచేశారు. మొత్తం 68 మంది విద్యార్థులకు రూ.2.10లక్షల నగదు పురస్కారాలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళ్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గౌరవాధ్యక్షుడు పట్టుపోగుల పుల్లయ్య, జనరల్ సెక్రటరీ పల్లా శేషయ్య, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు ఉమ్మడిశెట్టి చౌడయ్య, చౌడం వెంకట రమణ, గంజికుంట ఆంజనేయులు, లక్ష్మినారాయణ, రామయ్య, సుబ్బరాయుడు, శివాలయం మాజీ చైర్మన్ పల్లా శంకర్‌నారాయణ, రమణ, నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మారాం.. మాన్పించాలి

- హాలిడే మూడ్ నుంచి బయటకు తేవాలి
- బడికి చిన్నారులను సన్నద్ధం చేయండిలా
- హుషారు నింపి, బడికి పంపాలి

వేముల : వేసవి సెలవులు ముగిశాయి. పిల్లలు మళ్లీ పుస్తకాల బ్యాగు పట్టాల్సిందే. ఇన్ని రోజులు ఆటపాటలతో సందడి చేసిన పిల్లలు బడికెళ్లబోమని మారాం చేయడం సహజం. కానీ వీరి ఆలోచనలను ఆటల నుంచి బడి బాట వైపు మళ్లించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

పిల్లలూ.. ఇక బారెడు పొద్దెక్కేదాక నిద్రపోవడాలుండవు. అర్ధరాత్రి దాకా సెల్‌ఫోన్లు, కార్టూన్, పోగో, టీవీలు చూడటం ఉండదు. ఒక్కసారిగా టైంటేబుల్ మారిపోతుంది. మరి చిన్నారులు వెంటనే ఈ మార్పులకు సై అనగలరా? సెలవుల్లో మూలపడేసిన క్రమశిక్షణ అర్జంటుగా అలవరుచుకోగలరా? కొంత ఇబ్బందే. చిన్నారుల ఈ మానసిక స్థితిని తల్లిదండ్రులు, ఆపైన ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలి. ఈ మేరకు వారిని పాఠశాలకు సన్నద్ధం చేయాలి. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

బాధించొద్దు

శని,ఆదివారాల్లో సెలవులను ఎంజాయ్ చేసిన ఉద్యోగులు సోమవారం ఆఫీసుకు వెళ్లేందుకు కొంత ఇబ్బందులు పడతారు. వేసవి సెలవుల తర్వాత పిల్లల పరిస్థితి ఇంతకంటే బాధాకరంగా ఉంటుంది. స్కూల్‌కు వెళ్లేందుకు త్వరగా రెడీ అవ్వరు. కావాలని ఆలస్యం చేసి ఇంట్లోనే ఉండిపోవాలని చూస్తారు. వీరిని తల్లిదండ్రులు కొట్టడం లాంటివి చేస్తుంటారు. కానీ సున్నితంగా చెప్తేనే ఫలితం ఉంటుంది. బడి పునః ప్రారంభంలో పిల్లలు నిరాశతో కన్పిస్తారు. హోంవర్క్ చేయకపోవడంతో డల్‌గా ఉన్నాడా.. లేక ఇంకేదైనా ఆశిస్తున్నాడా.. అనేది తెలుసుకోవాలి. అప్పుడే మైండ్ సెట్ మార్చవచ్చు. ముందుగా వారి లక్ష్యం గురించి సావధానంగా వివరించండి. చదువుకుంటేనే అవి నెరవేరుతాయని మనసుకు హత్తుకునేలా చెప్పండి.

భయాన్ని తొలగించాలి

వేసవి సెలవుల్లో ఇష్టమైన ఆటపాటల్లో నిమగ్నమైన పిల్లలు స్కూల్‌కు వెళ్తే ఇలాంటి వాతావరణం కోల్పోతామని భయపడతారు. అందుకే మారాం చేస్తుంటారు. కానీ చదువుతో పాటు ఇష్టమైన ఆటలు సైతం ఆడుకోవచ్చని వారికి నచ్చచెప్పాలి.

కొత్తదనం ఉండాలి

తొలిసారి స్కూల్‌కు వెళ్లేవారు ఎంతో ఉత్సాహంగా ఉంటారు. రంగు రంగుల పుస్తకాలు, ఆటలు ఇలా వారు ఎంతో ఊహించుకుంటారు. మారాం చేయరు. అలాంటి వాతావరణం ఏటా పిల్లలకు కన్పించాలి. చాలా మంది తల్లిదండ్రులు తొలిసారి పిల్లలను స్కూల్‌లో చేర్పించినప్పుడు కనబర్చే శ్రద్ధ తర్వాత చూపరు. ఇది సరికాదు.

వాచ్‌ను సెట్ చేయాలి

పాఠశాల ప్రారంభపు రోజుల్లో పొద్దున్నే లేవండి... అంటూ తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. వారి మైండ్ సెట్‌లో ఉన్న వేళలు ఒకేసారి మారిపోవాలంటే కష్టం. దానికి కొంత సమయం పడుతుంది. నెమ్మదిగా వారి సమయాల్లో మార్పులు తీసుకురావాలి. వారి దినచర్యను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ ఆ ప్రకారం నడుచుకోవాలి.

ఒకే మాట అవసరం

క్రమశిక్షణ విషయంలో తల్లిదండ్రులు ఒకే మాటగా ఉండాలి. చాలా మంది పిల్లలను అమ్మ నిద్ర లేపుతుంటే నాన్న పడుకోనివ్వు అంటుంటారు. ఇలా చేయొద్దు.

ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపు ఘనంగా ముగించారు. గ్రంథాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాలు నాగేంద్ర, మునిబాబు, పద్మనాభరెడ్డిల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రంథాలయ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..


జమ్మలమడుగు : గ్రంథాలయాలు యువతకు, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే ఆలయాలని గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు ఎంఎల్ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం గ్రంథాలయ సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, లైబ్రరీయన్ జింకా శేఖర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పద్యపఠన పోటీలు, కథల చెప్పడం వంటివి పోటీలలో గెలిచిన వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆమీర్‌బాషా, దాదాఖలందర్, మిరియాల గణపతి తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఉపాధ్యాయులు

లింగాలలో..

లింగాల : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. 45 రోజులపాటు నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులను ఎంఈఓ వెంకట నారాయణరెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కమిటీ సభ్యులు

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : వేసవి సెలవుల్లో ప్రభుత్వం విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించడం కోసం గ్రంథాలయాలలో గతనెల 8వ తేదీనుంచి ఈనెల 11వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించింది. ఒక్కొక్క రోజు ఒక్కొక్క దానిపై అవగాహన కల్పించడంతోపాటు ఇంగ్లీషు నేర్పించడం, ఆట పాటలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వల్లూరులో విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారిణి

తొండూరులో..

తొండూరు : స్థానిక గ్రంథాలయంలో ఆదివారంతో సమ్మర్ క్యాంపు ముగిసింది. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు నాగేష్, శ్వేత, నాగేశ్వరమ్మలు హాజరై తమ సందేశం పిల్లలకు వినిపించారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారిణి స్వరూపరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్ర లేఖనం, డ్యాన్స్, చదరంగం మొదలైన అంశాలలో పోటీలను నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ కన్సోలేషన్ బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురంలో...

కమలాపురం : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గ్రంథాలయాధికారిణి ఎస్.నాగాంజలి ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశ భక్తి గేయాలు, చిత్ర లేఖనం, డ్యాన్స్, చదరంగం, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ రిటైర్డ్ అధికారి నరసింహులు చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.